క్లుప్తంగా

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

జడ్చర్ల: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు చేపట్టారు. శుక్రవారం సిగ్నల్‌గడ్డ వద్ద భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో సీఐ రమేశ్‌బాబు తమ సిబ్బందితో అక్కడకు చేరుకుని వాహనాల రాకపోకలకు చర్యలు తీసుకున్నారు. రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతుండడంతో తరచు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. రోడ్డుపై చిరువ్యాపారాలు సాగిస్తుండడంతో సమస్యలు తలెత్తున్నాయన్నారు. గుంతలను పూడ్చాలని, నీరు పిచికారీ చేయాలని సూచించారు.

రేపు సమావేశం

అడ్డాకుల: దేవకరద్ర పట్టణంలో ఆదివారం నియోజకవర్గ యాదవ విద్యావంతుల వేదిక సమావేశం నిర్వహించనున్నట్లు మండల సంఘం అధ్యక్షుడు ఎం.భీమన్నయాదవ్ తెలిపారు. యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ యాదవ్, విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైకని బాలుయాదవ్, జిల్లా అధ్యక్షుడు అంజన్నయాదవ్ సమావేశానికి హాజరు కానున్నట్లు వివరించారు. జయప్రదం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

అడ్డాకుల: గుడిబండకి చెందిన శివపై ఇటీవల గుర్తు తెలియని దుండగులు దాడి చేయడంతో ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం అక్కడికి వెళ్లి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం చేశారు. సర్పంచ్ భాస్కర్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

కరపత్రాల విడుదల

జడ్చర్ల: ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఈనెల 21న జరిగే ఎమ్మార్పీఎస్ నిరసన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో నాయకులు ఆవిష్కరించారు. టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు, రాజు, మాసయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన

నవాబుపేట: మండలంలో డెంగీ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ సూపర్ వైజర్ శకుంతల సూచించారు. శుక్రవారం గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలపై అవగాహన కల్పించారు.

ఘనంగా ఇంజనీర్స్‌డే

దేవరకద్ర రూరల్: చౌదర్‌పల్లి స్విట్స్ కళాశాలలో శుక్రవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజినీర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుధాకర్ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా చీఫ్ ఇంజనీర్ తిరుపతి రెడ్డి, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు హాజరైమాట్లాడారు. జయంతి ఎడ్యూకేషన్ సొసైటీ అధ్యక్షుడు కన్నయ్య, వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, సెక్రెటరీ బాలీశ్వర్, కోశాధికారి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం



అడ్డాకులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



అప్పంపల్లిలో మట్టి వినాయకులతో విద్యార్థులు

అడ్డాకుల: మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకుని అడ్డాకులలో శుక్రవారం మట్టి వినాయకుల విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు.

మూసాపేట మండల కేంద్రంలోని రైతువేదికలో మట్టి వినాయకులను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. వేముల శివారులోని ఎస్‌జీడీ ఫార్మా కంపెనీ అధినేత అక్షయ్‌సింగ్ సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీలు నాగార్జున్‌రెడ్డి, కళావతి, జెడ్పీటీసీలు రాజశేఖర్‌రెడ్డి, ఇంద్రయ్యసాగర్, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్ : మున్సిపాలిటీలోని చౌరస్తాలో కొజెంట్ పరిశ్రమ వారి సహకారంతో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. మట్టి విగ్రహం ఇంట్లోనే తొట్టిలో ఉంచి నీరు పోస్తే కరిగిపోయి అందులో ఉన్న విత్తనం మొలకెత్తి చెట్టుగా మారుతుందని, తద్వారా పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

చిన్నచింతకుంట: అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు మట్టి గణపతి విగ్రహాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు చక్రవర్తి గౌడ్, రవిశంకర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాల వల్ల తీవ్రమైన కాలుష్యం ఏర్పడుతుందన్నారు. అందువల్ల మట్టి విగ్రహాలనే పూజించాలన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, పద్మజ, సుశీల, కవిత పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి పొందాలి

నవాబుపేట: వినాయక మండపాల ఏర్పాటుపై నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే విగ్రహాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి అనుమతి తీసుకోవాలని, అనంతరం అట్టి ప్రతులను పోలీస్ స్టేషన్‌లో అందించాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ చేసుకోండి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించేవారు తమ పేర్లను గణేష్ ఉత్సవ సమితిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉత్సవ సమితిలో పేర్లు నమోదు చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. 18న ప్రతిష్ఠ, 27న నిమజ్జనం ఉంటాయన్నారు. ఇప్పటివరకు 140 రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు వివరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నగర కార్య అధ్యక్షుడు గుబ్బ భరత్‌కుమార్, ప్రముఖ్‌లు హన్మంతు, శ్రీధర్‌బాబు, శ్రీనివాస్, రవికుమార్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: విజయభేరి సభతో కాంగ్రెస్ ఎన్నికల సమరం పూరిస్తుందని జిల్లా అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకద్రలో విజయభేరి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17 న సోనియాగాంధీ పాల్గొనే కాంగ్రెస్ విజయభేరి సభకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమన్నారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎ.మధుసూదన్‌రెడ్డి, సభ నియోజకవర్గ కోఆర్డినేటర్ పురుషోత్తం, కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, కొండ ప్రశాంత్ రెడ్డి, అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం



స్వీట్లు తినిపిస్తున్న జహంగీర్‌బాబా తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో డ్రైవర్, కండక్టర్లకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వం విలీనం చేసినందుకు సీఎం కేసీఆర్‌కు, బిల్లును ఆమోదించినందుకు గవర్నర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. దీంతో ఆర్టీసీ కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపారాన్నారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ యాఖూబ్, జహీరుద్దీన్, ఖాదర్‌ఖాన్, మక్సూద్‌అలీ, రాజు, ముబీన్, సూఫి పాల్గొన్నారు.

యాదవ భవనానికి రూ. 2 కోట్లు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని తిరుమల హిల్స్‌లో నిర్మించనున్న యాదవ భవన నిర్మాణానికి రూ. 2 కోట్ల నిధులు, ఎకర భూమి కేటాయింపునకు సంబంధించిన ఉత్తర్వుల కాపీని శుక్రవారం సంఘం నాయకులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. నాయకులు గోపాల్‌యాదవ్, శాంతన్నయాదవ్, రాజు, నర్సింహ పాల్గొన్నారు.

చేపపిల్లల విడుదల

గండీడ్/మహమ్మదాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వంలో కులవృత్తులకు పూర్వవైభవం తెచ్చినట్లు పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాలార్ నగర్ చెరువులో 7,78,000 చేప పిల్లలను విడిచినట్లు వివరించారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

అడ్డాకుల: మండలంలోని వర్నెకి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన నీలమ్మ(38) గురువారం రాత్రి భర్త నర్సిములుతో గొడవపడిందన్నారు. ఈక్రమంలోనే ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయిందన్నారు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం ఆమె కుమార్తె మనీషా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అసంపూర్తి ప్రాజెక్టు ఎలా ప్రారంభిస్తారు?



మాట్లాడుతున్న పి.చంద్రశేఖర్

పాలమూరు: అసంపూర్తిగా ఉన్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు ప్రారంభం చేస్తున్నారో కేసీఆర్ చెప్పాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పి.చంద్రశేఖర్ అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టు కింద కనీసం కాల్వల నిర్మాణం జరగలేదని, సాగునీరు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టుకు తాగునీటి ప్రాజెక్టు అని, ఇక్కడి ప్రజలకు సాగునీరు అని చెబుతూ మోసం చేస్తున్నాడన్నారు. లక్ష్మీదేవిపల్లి దగ్గర నిర్మాణం చేయాల్సిన రిజర్వాయర్ రద్దు చేసినప్పుడే ఈ ప్రాజెక్టు పరిస్థితి ఏమిటో అర్థం అయ్యిందన్నారు. బీజేపీ నేతలు పడకుల బాలరాజు, పద్మజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి,అంజయ్య పాల్గొన్నారు.

సీఎం పర్యటనను అడ్డుకుంటాం

చిన్నచింతకుంట: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలమూర్– రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ పర్యటనను బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు అన్నారు. శుక్రవారం అమ్మపురంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్ పూర్తి కాకముందే ప్రారంభించాలనుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణంతో ఎంతోమంది రైతులు భూములు కోల్పోయారని వారికి కనీస పరిహారం ఇవ్వలేదన్నారు. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన అల్లాజీ పరిహారం అందకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. నాయకులు మహేష్‌యాదవ్, నరేందర్ పాల్గొన్నారు.

దళిత సర్పంచ్‌పై దాడి హేయమైన చర్య



మహబూబ్‌నగర్ రూరల్: దళిత మహిళా సర్పంచ్‌పై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కోయిలకొండ మండలం చందాపూర్ సర్పంచ్ జి.కవితపై అదే గ్రామానికి చెందిన కొందరు అకారణంగా దాడి చేశారన్నారు. కులంపేరుతో దాడులకు దిగడం హేయమైన చర్య అని అన్నారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే పోలీసులు బాధ్యులను అరెస్టు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. బాలచందర్, నర్సిములు, అనంతయ్య, భగవంతు, వెంకటయ్య, బుగ్గన్న, కె.అంతయ్య, సాయికుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

లోగో ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఈనెల 17న పట్టణంలో నిర్వహించే 'ఇండియా వర్సెస్ గార్బేజ్, యూత్ వర్సెస్ గార్బేజ్'లను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కమిషనర్ డి.ప్రదీప్ కుమార్ కోరారు. శుక్రవారం వీటికి సంబంధించిన 'మహబూబ్‌నగర్ ట్రాష్ టెర్మినేటర్స్' లోగోను ఆవిష్కరించారు. ఆదివారం పిల్లలమర్రి లోని పాడి, తడిచెత్తను సేకరించి వేరు చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అక్కడ మానవహారంతో పాటు స్వచ్ఛతపై అందరూ ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. ఇందులో చేరడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి 'మై గవర్నమెంట్ యాప్' ద్వారా పేరు నమోదు చేసుకోవచ్చన్నారు. టీపీఓ లక్ష్మీపతి, ఎంఈ యు.బస్వరాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, గురులింగం పాల్గొన్నారు.

కృష్ణా జలాల కోసం కలశాల అందజేత

జడ్చర్ల: పాలమూర్ ప్రాజెక్టులో భాగంగా కేసీఆర్ శనివారం పూజలు చేసి మోటార్లు ప్రారంభించిన వెంటనే అక్కడి నుంచి కృష్ణాజలాలు తెచ్చి గ్రామాల్లోని ఆలయాల్లో అభిషేకం చేయనున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నివాసంలో జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య ఈ మేరకు సర్పంచ్‌లకు కలశాలు అందించారు. సింగిల్‌విండో చైర్మన్ సుదర్శన్‌గౌడ్, మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ప్రణీల్ పాల్గొన్నారు.

నవాబుపేట: మండలం నుంచి 54 కలశాలతో కృష్ణానది నీటిని తీసుకుని వచ్చి వాటితో గ్రామాల్లోని దేవతలకు అభిషేకం చేయనున్నట్లు జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య శుక్రవారం తెలిపారు. ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ముస్లింలను ఓటు బ్యాంక్‌గా మార్చుకున్నారు

భూత్పూర్ : ముస్లింలను కాంగ్రెస్ నాయకులు ఓటుబ్యాంక్‌గా మార్చుకొన్నారని..కానీ వారి అభివృద్ధికి కృషి చేయలేదని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కాగా తమ ప్రభుత్వం వారికి అండగా ఉందన్నారు. శుక్రవారం పట్టణంలో జెడ్పీ చైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్‌తో కలిసి మైనార్టీలకు రూ.లక్ష చొప్పున రుణాలు, కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, చైర్మన్ బస్వరాజ్ గౌడ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన



జడ్చర్లలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

జడ్చర్ల: అంగన్‌వాడీలు శుక్రవారం జడ్చర్లలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు ఆందోళనలు ఆపేదిలేదని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి, సరోజ, జ్యోతి, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం దేవరకద్రలో నిరవధిక సమ్మెలో భాగంగా ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలకు మద్దతుగా ఆయన పాల్గొని మాట్లాడారు. పుష్పలత, కవిత, కళావతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

అడ్డాకుల: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రహదారిపై రాంగ్ రూట్లో వచ్చిన ద్విచక్రవాహనం ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలపై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులిద్దరిని ఎల్అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించారు. ఇందులో ఒకరు తంగెళ్లపల్లికి చెందిన జంగయ్యగా తెలిసింది. మరో వాహనంపై ఉన్న యువకుడు పశ్చిమ బెంగాల్‌కు చెందిన వాడని తెలియవచ్చింది.

సభకు తరలిరండి

భూత్పూర్ : సీఎం కేసీఆర్ చేతులమీదుగా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం శనివారం ప్రారంభిస్తున్న సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతిగ్రామం నుంచి భారీగా ప్రజలు తరలి రావాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కొత్తూర్‌లో రెండు పడక గదుల పనులను పరిశీలించారు. అనంతరం కర్వెన ప్రాజెక్టును పరిశీలించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రంలో శుక్రవారం పంచాయత్‌రాజ్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మైనార్టీ కార్పోరేషన్ చైర్మన్ ఇంతియాజ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, చైర్మన్ బస్వరాజ్ గౌడ్ పాల్గొన్నారు.

బాలానగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు రైతులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, ఇతరులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని బాలానగర్ జెడ్పీటీసీ కల్యాణి, ఎంపీపీ కమల శుక్రవారం కోరారు.

వివాదాస్పదమైన కూల్చివేత

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామంలో గుట్ట సమీపంలో ఉన్న పాత కోట స్థలాన్ని శుక్రవారం చదును చేస్తూ శిథిలమైన గోడలను కూల్చి వేయడం కొంత వివాదాస్పదానికి దారి తీసింది. గ్రామానికి చెందిన కొందరు ఆ స్థలం తమదేనని అక్కడ చదును చేయిస్తున్నారు. కాగా ఇక్కడే చోళులు, కాకతీయుల కాలం నాటి కోట ఉండగా అది పూర్తి శిథిలావస్థకు చేరింది. కాగా ఆ స్థలం గ్రామకంఠంలో ఉందని స్థానికులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం చదును చేయిస్తుండటంతో మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారని ఎంపీడీఓ మంజుల తెలిపారు. కాగా ఆ స్థలం ఎవరిదన్న దానిపై అధికారులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

వైభవంగా శ్రీకృష్ణుడి పల్లకీసేవ





స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో పదిరోజుల నుంచి కృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం కృష్ణుని ప్రతిమకు పూజలు నిర్వహించి పల్లకీసేవ చేపట్టారు. ఊరేగింపులో భక్తుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగ్యనాయక్, సభ్యులు యాదయ్య, లక్ష్మయ్య, లక్ష్మీ, నాగరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.